ప్రజాశక్తి
శనివారం 29 మార్చి 2025 5 విజయనగరం

జిల్లాలో బెట్టింగ్ భూతం

గొట్లాంలో బుకీ అరెస్ట్

ప్రజాశక్తి-బొండపల్లి

బొండపల్లి మండలంలోని గొట్లాం గ్రామంలో గురువారం రాత్రి క్రికెట్ బుకీని అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ యు.మహేష్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం బొండపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ వివరాలు వెల్లడించారు. గొట్లాం గ్రామానికి చెందిన టి.ఆదినారాయణ.. గురువారం ఐపిఎల్‌లో హైదరాబాద్, లక్నో జట్ల మధ్య మ్యాచ్‌కు తన ఇంట్లో క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్నట్లు సమాచారం వచ్చిందన్నారు. పక్కా సమాచారం కావడంతో దాడులు చేసి, ఇంట్లోనే ఆదినారాయణను అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. ఆదినారాయణ వద్ద నుంచి రూ.90,500 నగదు, మూడు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. క్రికెట్ బెట్టింగ్‌తో సంబంధం ఉన్న వ్యక్తులపై ఆరా తీస్తున్నామని చెప్పారు.

కూలి రేట్లు పెంచకుండా వేతనాలు పెరుగుతాయా?

కూలి రేట్లు పెంచలేదు. కానీ, వేతనం మాత్రం రూ.300కు పెరిగిపోతుందట. ఇది ప్రభుత్వ వింత ప్రచారం. ఈ మేరకు అధికారులతో ప్రభుత్వం తప్పుడు ప్రచారం చేయిస్తోంది. ఊరకే ప్రచారంతో సరిపెడితే నష్టం తప్ప కష్టమేమీ లేదు. కానీ, రెండు పూటలా పనిచేయాలని ఒత్తిడి చేయడంతో కూలీలకు కష్టతరంగా మారింది. అధికార యంత్రాంగం తాజాగా రోజుకు 7నుంచి 8గంటలు పనిచేయాలని మెలికపెడుతుండడమే ఇందుకు తార్కాణం. దీంతో, కూలీలు మండుటెండలో అందులోనూ గట్టినేలలు తవ్వలేక విలవిలలాడి పోతున్నారు. చివరకు గొర్రె తోక బెత్తెడే అన్న చందంగా కూలి మాత్రం గరిష్ఠంగా రూ.250 నుంచి రూ.270కి మించి రావడం లేదు.

గంగచోళ్లపెంటలో ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

- ఉపాధి హామీలో వింత పంచాంగం
- రోజుకు రూ.300 వేతనం వస్తుందంటూ అధికారుల ప్రచారం
- తెరవెనుక అదనపు పనికి ఒత్తిడి
- ఎండ తీవ్రతతో విలవిల్లాడుతున్న కూలీలు

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

ఉపాధి హామీ పథకం ద్వారా ప్రస్తుతం ఫారం పాండ్స్, ఫిష్ పాండ్స్, బౌండ్రీట్రెంచ్, రింగ్ ట్రెంచ్, ఇంకుడు గుంతలు, కాంపౌండ్ పిట్స్, చెరువులు అభివృద్ధి పర్చడం వంటి పనులకు ప్రాధాన్యతనిస్తున్నారు. వీటిలో చెరువుల అభివృద్ధికి ప్రాధాన్యత తగ్గింది. మిగిలిన వాటిలో బౌండ్రీ ట్రెంచ్, రింగు ట్రెంచ్ పనులకు మాత్రమే క్యూబిక్ మీటర్‌కు రూ.318 చొప్పున కూలి రేట్లు ఉన్నాయి. మిగిలినవి రూ.215 నుంచి రూ.278 వరకు రేట్లు ఉన్నాయి. ఇవి కూడా కొత్తగా పెంచిన రేట్లేమీ కావు. దాదాపు డిసెంబర్ నుంచి వర్షాలు లేకపోవడంతో అన్ని ప్రాంతాల్లోనూ నేల గట్టిబడిపోయింది. మండుటెండలో ఈ పనులు చేయడమంటే మాటలు కాదు. అసలే వేసవికి ముందు నుంచే ఎండలు ఠారెత్తిస్తున్నాయి. కొన్ని నెలలుగా చినుకు రాలకపోవడంతో నేల గట్టిగా ఉంటోంది. గుణపాలు కిందికి దిగడం లేదు. పారలు అరిగిపోతున్నా అనుకున్నంత మట్టి తీయలేకపోతున్నారు. తేలికపాటి నేలల్లో సైతం ఒక క్యూబిక్ మీటరు తవ్వాలంటే ఇద్దరు నుంచి ముగ్గురు కూలీలు శ్రమించాల్సివస్తోందని వేతన జీవులు ఆవేదన వ్యక్తం చేస్తుండగా, ఇదే విషయాన్ని మేట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు కూడా అంగీకరిస్తున్నారు. ఇటువంటి పరిస్థితుల్లో పనిలో ఒకింత వెసులుబాటు కల్పించాల్సిన ప్రభుత్వం రెండు పూటలా పనిపెట్టింది. ఈనేపథ్యంలో కనీస వేతనం రూ.600 చెల్లించాలంటూ దేశ వ్యాప్తంగా కూలీల తరపున వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యాన ఆందోళన కార్యక్రమాలు చేపడుతున్న విషయం విధితమే. ఇటీవల పార్లమెంటులోకూడా చర్చనడిచింది. ఈనేపథ్యంలో కనీసం రూ.300 వేతనం వస్తుందని నమ్మబలికేందకు ప్రభుత్వం అధికారులతో ప్రచారాలు చేయిస్తోంది. అధికారుల ఆదేశాల ప్రకారం రెండు పూటలా కలిపి ఎనిమిది గంటలు పనిచేయాల్సిందేనని ఫీల్డ్ అసిస్టెంట్లు కూలీలపై ఒత్తిడిచేస్తున్నారు. ఈనేపథ్యంలో అటు పనికి తగ్గ వేతనం అందక, ఇటు పనిఒత్తిడితో కూలీలు సతమతమౌతున్నారు.

రెండు పూటలా చెయ్యలేకపోతున్నాం

గతంలో ఒక్కపూటే పనిచేసేవాళ్లం. రూ.200 వేతనం వచ్చేది. ప్రస్తుతం రెండు పూటలా పనిచేయాలని ఒత్తిడి చేస్తున్నారు. ఎండకు తట్టుకోలేక పోతున్నాం. భూమి కాడడం లేదు. పారలు, గునపాలు కూడా మట్టిలో దిగడం లేదు. ఇటువంటి పరిస్థితుల్లో 8గంటల పాటు పనిచేయమంటే కష్టం. వ్యవసాయ పనులు కూడా ఇన్ని గంటలపాటు చేయలేం.

- తమటాడ పైడన్న, గంగచోళ్లపెంట, గజపతినగరం మండలం

రూ.250 కూడా అందడం లేదు

అధికారులకేం పోయింది. ఎంతైనా వస్తాది అని చెప్తారు. పథకం పెట్టినప్పటి నుంచీ నేను ఉపాధి పనులకు వెళ్తున్నాను. ఒక్కరోజు కూడా రూ.250 మించి వేతనం రాలేదు. ఇప్పుడు కూడా అంతకు మించి పని చేయలేను. కూలి రేట్లు పెంచకుండా వేతనాలు ఎలా పెంచుతారు. మాపై ఒత్తిడిచేసి, రెట్టింపు పనిచేయించుకుని కూలి పెంచితే అది కూలి రేట్లు పెంచినట్టు లెక్కా? దీనికి ప్రభుత్వమూ, అధికారులే సమాధానం చెప్పాలి.

- ఇమంది నాగరాజు, పాతబగ్గాం గ్రామం గజపతినగరం మండలం

విజయనగరంలో నిరసన తెలుపుతున్న సిపిఎం నాయకులు, కార్మికులు

విద్యుత్తు భారాలపై సిపిఎం నిరసనలు

ప్రజాశక్తి- విజయనగరంటౌన్

విద్యుత్ సర్దుబాటు ఛార్జీలను, సెకీ ఒప్పందాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సిపిఎం ఆధ్వర్యాన పెద్దచెరువు వద్దగల ప్రాంతీయ విద్యుత్తు కార్యాలయం వద్ద శుక్రవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగాసిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు రెడ్డి శంకర్రావు మాట్లాడుతూ టిడిపి ప్రభుత్వం ఎటువంటి విద్యుత్ ఛార్జీలూ పెంచబోమని చెబుతూనే ట్రూఅప్ ఛార్జీల పేరు తో ఇప్పటికే 17 వేల కోట్ల రూపాయలు ప్రజలపై భారాలు వేసిందన్నారు. తాజాగా సెకీ ఒప్పందం ప్రకారం మరో రూ.8వేల కోట్లు భారాలు వేసేందుకు సిద్ధమవుతోందనిఅన్నారు. వెంటనే సెకీ ఒప్పందాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు కె.సురేష్, ఎ.జగన్మోహన్, పి.రమణమ్మ, వి.లక్ష్మి, రవి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

చీపురుపల్లి : సెకీ ఒప్పందాన్ని రద్దు చేయాలని కోరుతూ చీపురుపల్లి విద్యుత్తు సబ్‌స్టేషన్ వద్ద సిపిఎం నాయకులు టివి రమణ, అంబళ్ల గౌరినాయుడు ఆధ్వర్యాన ధర్నా చేపట్టారు. అనంతరం విద్యుత్తు బిల్లులను దహనం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ యువగళం పాదయాత్రలో 'స్మార్ట్ మీటర్లు ఎక్కడ పెట్టినా, వ్యవసాయ పంపుసెట్లకు మీటర్లు బిగించినా వాటిని పగలగొట్టండి, తిరుగుబాటు చేయండి. ఒకవేళ కేసులు పెడితే మా ప్రభుత్వం వచ్చిన తరువాత వాటిని తీసేస్తాం. కరెంటు కష్టాలు తీరుస్తాం. సెకీ ఒప్పందాన్ని రద్దు చేస్తామ'ంటూ ప్రగల్భాలు పలికారని గుర్తుచేశారు. టిడిపి అధికారంలోకి వస్తే సెకీ ఒప్పందం రద్దవుతుందని, స్మార్ట్ మీటర్లు ఉండవని ప్రజలు ఆశించారని చెప్పారు. తీరా టిడిపి కూటమి అధికారంలోకి వచ్చాక సెకీ ఒప్పందాన్ని మరింత పకడ్బందీగా అమలు చేయడానికి యత్నిస్తోందని ఆగ్రహం వ్యక్తంచేశారు. సెకీ ఒప్పందం అమలైతే ట్రూఅప్ ఛార్జీలు, సర్దుబాటు ఛార్జీలు, స్మార్ట్ మీటర్ల ఏర్పాటు, టైమ్ ఆఫ్ విధానం వంటివి అమల్లోకి వస్తాయని ఆందోళన వ్యక్తంచేశారు. అదానీని పెంచి పోషించేందుకు మోడీ చెప్పినట్లు సిఎం చంద్రబాబు ఆడుతున్నారని విమర్శించారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

చీపురుపల్లిలో విద్యుత్తు బిల్లులను దహనం చేస్తున్న సిపిఎం నాయకులు

నల్లబ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న ముస్లిములు

నల్లబ్యాడ్జీలతో ముస్లిముల నిరసన

ప్రజాశక్తి-బొబ్బిలి

కేంద్ర ప్రభుత్వం పార్లమెంటులో ప్రవేశ పెట్టిన వక్ఫ్ బోర్డు సవరణ బిల్లుకు వ్యతిరేకంగా ముస్లిములు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. బొబ్బిలి పట్టణంలోని జామియా మసీదు వద్ద శుక్రవారం నమాజ్ అనంతరం నిరసన తెలిపారు. వక్ఫ్ బోర్డు సవరణ బిల్లును వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ముస్లిములు పాల్గొన్నారు.

సిజిఎస్‌టి అధికారిగా హరీష్

ప్రజాశక్తి-తెర్లాం

తెర్లాం గ్రామానికి చెందిన చిప్పాడ రమణమూర్తి కుమారుడు చిప్పాడ హరీష్ సెంట్రల్ జిఎస్‌టి ఇన్‌స్పెక్టర్‌గా ఎంపికయ్యారు. ఎస్ఎస్‌సి సిజిఎల్‌లో 390 మార్కులకు గాను 346 మార్కులు సాధించి, ఆలిండియా ఒబిసి కోటాలో 1602వ ర్యాంకు సాధించారు. ప్రస్తుతం ఆదాయ పన్ను శాఖలో చెన్నైలో ట్యాక్స్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్నారు.

తాగునీటి సమస్య రాకుండా చర్యలు

పాఠశాలల్లో ప్రతి రెండు గంటలకూ వాటర్ బెల్ : కలెక్టర్

ప్రజాశక్తి-విజయనగరం

మాట్లాడుతున్న కలెక్టర్ బిఆర్ అంబేద్కర్

ఈవేసవి లో ఎక్కడా తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ తెలిపారు. వెంటనే అన్ని గ్రామాల్లో ఉన్న అన్ని బోరు బావులను తనిఖీ చేసి, వినియోగంలోనికి వచ్చేలా చూడాలని ఆదేశించారు. పైప్ లైన్ల లీకేజీలు లేకుండా చూడాలని, రెగ్యులర్ గా క్లోరినేషన్ చేయాలని సూచించారు. శుక్రవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో జిల్లా, మండల, నియోజకవర్గ స్థాయి అధికారులతో సమావేశం ఏర్పాటు చేసి తాగునీరు, వడ గాల్పులు , ఉపాధి హామీ పనులు, పించన్ల పంపిణీ తదితర అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తాగునీటి సమస్య పరిష్కారంలో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని స్పష్టం చేసారు.

తాగు నీటి సమస్యల పై 73825 63040 కు కాల్ చేయండి

తాగునీటి సమస్య పై జిల్లా పరిషత్‌లో 24/7 కంట్రోల్ రూమ్ ను ఏర్పాటు చేయాలని జెడ్‌పి సిఇఒకు సూచించారు. నీటి సరఫరాపై ప్రజల నుండి అందిన వినతులకు వెంట వెంటనే చర్యలు తీసుకోవాలని, అదే విధంగా రోజుకు ఎన్ని వినతులు అందాయి, ఎలాంటి పరిష్కారం చేసారు అనే అంశాలపై రోజువారీ నివేదిక అందజేయాలని ఆదేశించారు. తాగు నీటి సమస్యల పై ప్రజలు కంట్రోల్ రూమ్ నెంబర్ 73825 63040కు ఫోన్ చేసి సమస్యను చెప్పవచ్చునని తెలిపారు.

వడగాల్పుల సమాచారం కోసం కలెక్టరేట్ లో కంట్రోల్ రూమ్

ఏప్రిల్, మే నెలల్లో వేసవి తీవ్రత అధికంగా ఉండి వడ గాల్పులు వీచే అవకాశం ఉన్నందున ప్రజలంతా తగు జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. వడగాల్పులకు సంబంధించిన సమాచారాన్ని కలెక్టరేట్ లో నున్న కంట్రోల్ రూమ్ కు ఫోన్ ద్వారా తెలియజేయాలని తెలిపారు. కంట్రోల్ రూమ్‌కు అందిన కాల్స్‌కు అధికారులు తక్షణమే స్పందించాలని సూచించారు. వేసవి తాపానికి గురి కాకుండా కూడళ్ళ లో చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని, మజ్జిగ పాకెట్ల ను కూడా మేజర్ పంచాయతీ, మండల, మున్సిపల్ కేంద్రాల్లో సిద్ధంగా ఉంచాలని తెలిపారు.

ఉపాధి కూలీలకు పని గంటలు మార్చాలి

ఉపాధి పనులు చేసే కూలీలకు వేసవి తాపం తగలకుండా పని వేళలను మార్చాలని కలెక్టర్ తెలిపారు. ఉదయం 6.30 నుండి 9.30 గంటల లోపు, సాయంత్రం 5 నుండి 7 గంటల లోపు పని వేళలు ఉండేలా చూడాలన్నారు. క్షేత్ర స్థాయిలో పని చేసే చోట షామియానా లు వేయాలని, తాగు నీటిని అందుబాటు లో ఉంచాలని తెలిపారు. పశువులకు పశు గ్రాసం సమస్య తలెత్తకుండా చూడాలని పశు సంవర్ధకశాఖ జెడికి సూచించారు. పాఠశాలల్లో కూడా వేసవిని దృష్టిలో పెట్టుకొని ప్రతి రెండు గంటలకు ఒకసరి వాటర్ బెల్ కొట్టాలని డిఇఒకు ఆదేశించారు. ఈనెల 30, 31 తేదీలలో సెలవులు ఉన్నందున 29న పింఛను డబ్బులు డ్రాచేసి 1 వ తేదీన ఉదయం 7 గంటల నుండి పంపిణీకి సిద్ధంగా ఉంచాలని ఎంపిడిఒలకు కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో డిఆర్ఒ శ్రీనివాసమూర్తి, ఆర్‌డిఒలు, నియోజకవర్గం ఇంఛార్జిలైన డిప్యూటీ కలెక్టర్లు, జిల్లా అధికారులు, మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.

ఎఎంసి ఛైర్మన్ల నియామకం

బొబ్బిలికి వెంకటనాయుడు, కొత్తవలసకు మల్లునాయుడు

ప్రజాశక్తి-తెర్లాం, శృంగవరపుకోట

నర్సుపల్లి వెంకటనాయుడు ; చొక్కాకుల మల్లునాయుడు

జిల్లాలో బొబ్బిలి, కొత్తవలస వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్లను ప్రభుత్వం శుక్రవారం నియమించింది. బొబ్బిలి ఎఎంసి ఛైర్మన్‌గా నర్సుపల్లి వెంకట నాయుడు నియమితులయ్యారు. తెర్లాం మండలానికి చెందిన టిడిపి సీనియర్ నాయకులైన వెంకటనాయుడు కార్యకర్త నుంచి అంచలంచెలుగా ఎదుగుతూ అనేక పదవులు చేపట్టారు. పార్టీకి, కార్యకర్తలకు, ప్రజలకు సేవలందిస్తూ వచ్చారు. ఎఎంసి ఛైర్మన్‌గా నియమితులైన వెంకటనాయుడుకు మండలంలోని టిడిపి నాయకులు, కార్యకర్తలు శుభాకాంక్షలు తెలియజేశారు. తనకు ఈ అవకాశం కల్పించిన ఎమ్మెల్యే బేబినాయన, బుడా ఛైర్మన్ తెంటు రాజాకు వెంకటనాయుడు కృతజ్ఞతలు తెలిపారు.

కొత్తవలస వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్‌గా చొక్కాకుల మల్లునాయుడు నియమితులయ్యారు. టిడిపి లక్కవరపుకోట మండల అధ్యక్షులుగా మల్లునాయుడు పనిచేస్తున్నారు. ఈ సందర్భంగా టిడిపి అధిష్టానానికి, ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారికి మల్లు నాయుడు కృతజ్ఞతలు తెలియజేశారు. ఎఎంసి ఛైర్మన్‌గా మల్లునాయుడు ఎంపిక పట్ల కూటమి నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

1న టెన్త్ సోషల్ పరీక్ష

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఈనెల 31న జరగాల్సిన పదో తరగతి సోషల్ పరీక్ష ఏప్రిల్ 1వ తేదీకి వాయిదా పడిందని డిఇఒ యు.మాణిక్యంనాయుడు తెలిపారు. 31న రంజాన్ కారణంగా ప్రభుత్వం ఈ పరీక్షను వాయిదా వేసింది. మంగళవారం ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు పరీక్ష జరుగతుందని తెలిపారు. ఈ మార్పును పరీక్షా సిబ్బంది, విద్యార్థులు గమనించాలన్నారు. యాజమాన్య పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఈ విషయాన్ని విద్యార్థులకు తెలియజేయాలని తెలిపారు.

జీవశాస్త్రం పరీక్షకు 119 మంది గైర్హాజరు

జిల్లాలో శుక్రవారం జరిగిన 10 వతరగతి జీవశాస్త్రం పరీక్షకు 119 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. రెగ్యులర్ 22919 మంది కిగాను 22,800 మంది హాజరయ్యారు. ప్రైవేటు విద్యార్థులు 430 మందికి గాను 359 మంది హాజరుకాగా, 71మంది గైర్హాజరయ్యారు. పరీక్షలు ప్రశాతంగా జరిగాయని డిఇఒ యు.మాణిక్యంనాయుడు తెలిపారు.

పది పరీక్షలు రాస్తున్న తల్లీకూతురు

పరీక్షలకు వెళ్తున్న తల్లీ కూతురు రమాదేవి, సాయి సుప్రియ

పూసపాటిరేగ : పూసపాటిరేగ మండలంలోని చోడమ్మ అగ్రహారం గ్రామానికి చెందిన పిళ్లా రమాదేవి, ఆమె కుమార్తె పిళ్లా సాయిసుప్రియ పదో తరగతి పరీక్షలు రాస్తూ అందరినీ ఆశ్చర్యపరిచారు. పూసపాటిరేగ ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి చదువుతున్న సుప్రియ.. ఆర్డర్ పాఠశాలలో పరీక్షలు రాస్తోంది. ఆమె తల్లి రమాదేవి దూరవిద్య ద్వారా ఓపెన్ స్కూల్ పదోతరగతి చదువుతూ, ధర్మపురిలోని చైతన్య పాఠశాలలో పరీక్షలకు హాజరవుతున్నారు. తన కుమార్తె ప్రోద్బలంతో భార్యను కూడా పదో తరగతి పరీక్షలు రాయిస్తున్నట్లు రమాదేవి భర్త పిళ్లా శ్రీరాములు తెలిపారు. గతంలో ఆరో తరగతి వరకూ రమాదేవి చదివి, ఆపేశారని, ఓపెన్ స్కూల్ ద్వారా పదో తరగతి చదివించామని వివరించారు. చదువుకు వయసుతో పనిలేదని చెప్పేందుకే ఇలా రాయిస్తున్నానని వెల్లడించారు.

పోక్సో కేసులో నిందితుడికి 20ఏళ్ల జైలు

ప్రజాశక్తి-విజయనగరంకోట

విజయనగరం మహిళా పోలీసు స్టేషన్లో 2021 సంవత్సరంలో నమోదైన పోక్సో కేసులో నిందితుడు గోకపేటకు చెందిన కంది సన్యాసిరావుకు 20ఏళ్ల జైలు శిక్ష, రూ.10,500 జరిమానా విధిస్తూ పోక్సో కోర్టు ప్రత్యేక న్యాయమూర్తి కె.నాగమణి తీర్పు చెప్పారు. విజయనగరానికి చెందిన 16ఏళ్ల బాలికతో గోకపేటకు చెందిన కంది సన్యాసిరావు అలియాస్ సిద్దు (19) ఫేస్‌బుక్‌లో పరిచయం ఏర్పరుచుకొని, ఆమెను పెళ్లి చేసుకుంటానని నమ్మించి, తరచూ తన ఇంటికి తీసుకువెళ్ళి బాలికపై అత్యాచారానికి పాల్పడ్డాడు. గర్భవతిని చేసి, పెండ్లికి నిరాకరించి మోసం చేసినట్లుగా విజయనగరం మహిళా పోలీసు స్టేషనులో ఫిర్యాదు నమోదైంది. అప్పటి ఎస్ఐ బి.స్వర్ణలత పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. ఈ కేసును అప్పటి దిశా మహిళా పిఎస్ డిఎస్పీ టి.త్రినాధ్ దర్యాప్తు చేసి, నిందితుడిని అరెస్టు చేసి, కోర్టులో అభియోగ పత్రం దాఖలు చేశారు. ఈ నేపథ్యంలో నేరం రుజువు కావడంతో నిందితుడికి న్యాయమూర్తి 20ఏళ్ల జైలుశిక్ష విధిస్తూ తీర్పు వెల్లడించారని ఎస్‌పి వకుల్ జిందాల్ తెలిపారు.

ఎల్‌బిజి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సిపిఎం నాయకులు

ప్రజా పోరాటాలు ఉధృతం చేయడమే

ఎల్‌బిజికి నివాళి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

కార్మిక రాజ్య స్థాపన కోసం ప్రజా పోరాటాలు ఉధతం చేయాలని, అదే ఎల్‌బిజికి మనమిచ్చే నివాళని సిపిఎం నాయకులు ఎం.శ్రీనివాస్ అన్నారు. సిపిఎం అఖిలభారత నాయకులు లావు బాలగంగాధరరావు 22వ వర్థంతి కార్యక్రమాన్ని శుక్రవారం స్థానిక ఎల్‌బిజి భవన్‌లో నిర్వహించారు. ఆయన చిత్రపటానికి సిపిఎం నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ భారత దేశంలో శ్రామిక రాజ్యం స్థాపన కోసం అహర్నిశలు పోరాటాలు నిర్వహించిన నాయకుడు ఎల్‌బిజి అని కొనియాడారు. వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ నాయకులు గా, సిపిఎం రాష్ట్ర కార్యదర్శిగా అనేక ఉద్యమాలు చేశారని గుర్తు చేశారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు రెడ్డి శంకరరావు, జిల్లా కమిటీ సభ్యులు పి.రమణమ్మ, నగర నాయకులు లక్ష్మి, హరీష్, రవిపాల్గొన్నారు.

క్షయ నిర్ధారణ పరీక్షల్లో విజయనగరం టాప్

కేంద్ర మంత్రి జెపి నడ్డా నుంచి అవార్డు

విజయనగరం కోట : క్షయ వ్యాధి నిర్ధారణ పరీక్షల్లో విజయనగరం జిల్లాకు జాతీయ స్థాయి గుర్తింపు లభించింది. క్షయవ్యాధి నియంత్రణ ప్రత్యేక వందరోజుల ఉద్యమంలో దేశంలోనే అత్యధిక క్షయవ్యాధి నిర్ధారణ పరీక్షలు చేసిన జిల్లాగా గుర్తింపు పొందింది. క్షయ నియంత్రణకు వంద రోజుల ప్రత్యేక కార్యక్రమాన్ని గత ఏడాది డిసెంబరు 7న ప్రారంభించారు. క్షయ వ్యాధిపై ప్రజల్లో అవగాహన కలిగించడంతోపాటు క్షయవ్యాధి లక్షణాలు కలిగివున్న వారికి వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించడం వంటి కార్యక్రమాలు ఆయా జిల్లాల్లో చేపట్టారు. వందరోజుల కార్యక్రమానికి ఎంపికైన 347 జిల్లాలన్నింటిలోకి విజయనగరంలోనే అత్యధికంగా 45,195 క్షయవ్యాధి నిర్ధారణ కోసం ట్రూనాట్ పరికరాల ద్వారా కఫం పరీక్షలు చేసి దేశంలోనే ప్రథమస్థానంలో నిలిచినట్టు జిల్లా కలెక్టర్ బి.ఆర్.అంబేద్కర్ వెల్లడించారు. మొత్తం 866 మంది క్షయ వ్యాధిగ్రస్తులను గుర్తించినట్టు పేర్కొన్నారు. ప్రపంచ క్షయ దినోత్సవం సందర్భంగా ఈనెల 24న కేంద్ర ఆరోగ్యశాఖ మంత్రి జె.పి.నడ్డా నుంచి ఈ మేరకు క్షయ నియంత్రణపై విజయనగరం జిల్లాకు చెందిన కేంద్ర బృందం ప్రతినిధి పి.రమేష్ ఈ అవార్డు స్వీకరించినట్టు వెల్లడించారు. ఈ సందర్భంగా డిఎంహెచ్ఒ ఎస్.జీవనరాణి, క్షయ నియంత్రణ అధికారి కె.రాణి, వైద్యాధికారులు, సిబ్బందిని, క్షయ నియంత్రణ విభాగం సిబ్బందిని జిల్లా కలెక్టర్ అభినందించారు.

పాస్టర్ ప్రవీణ్ మృతిపై సమగ్ర విచారణ చేపట్టాలి

కలెక్టరేట్ ఎదుట క్రైస్తవ సంఘాల నిరసన

నిరసన తెలుపుతున్న క్రైస్తవ సంఘాల సభ్యులు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

రాజమండ్రిలో పాస్టర్ ప్రవీణ్ పగడాల మృతి క్రైస్తవ సమాజానికి తీరని లోటు అని, ఆయన మృతిపై సమగ్ర విచారణ చేపట్టాలని కోరుతూ క్రైస్తవ సంఘాలు శుక్రవారం కలెక్టరేట్ ఎదుట పెద్దఎత్తున నిరసన తెలిపాయి. జిల్లా క్రిస్టియన్ ఫెడరేషన్ అధ్యక్షులు రెవ.బిఎం రాజు, జిల్లా క్రిస్టియన్ మైనారిటీ సెల్ అధ్యక్షులు రెవ.ఎస్. మధు మాట్లాడుతూ క్రైస్తవ సమాజంలో ఎంతో పేరొందిన నాయకుడు పాస్టర్ ప్రవీణ్ పగడాల మరణం పలు అనుమానాలకు దారి తీస్తోందని అన్నారు. ప్రభుత్వం జోక్యం చేసుకొని క్రైస్తవ సమాజాన్ని కాపాడాలని, ఫెడరేషన్ వింగ్ ప్రెసిడెంట్ పట్నానా పైడిరాజు కోరారు. ఆలిండియా క్రిస్టియన్ కౌన్సిల్ జిల్లా అధ్యక్షులు పి. ప్రేమానందం మాట్లాడుతూ పాస్టర్ ప్రవీణ్ మరణం ప్రమాదం కాదని, అది కేవలం హత్య అని క్రైస్తవులందరికీ అనుమానాలు ఉన్నాయని అన్నారు. హంతకులను గుర్తించి వారిని వెంటనే శిక్షించి క్రైస్తవ సమాజానికి రక్షణ కల్పించాలని, రాష్ట్రంలో మత స్వేచ్ఛను కాపాడాలని కోరారు. రెవ. ఎం. ఐజాక్, జిల్లా దళిత నాయకులు రమణ మాట్లాడుతూ ప్రభుత్వం పక్షపాతం వహించకుండా సరియైన న్యాయపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో విజయనగరం జిల్లా పాస్టర్స్ ఫెలోషిప్ ప్రెసిడెంట్ ఎం.పాల్సన్, కె.వివేక్, ఎల్.పి.ప్రెసిడెంట్ వి. సత్యరాజు, సెక్రటరీ మధుసూదన్, డి.ఎలీషా, మధు మనోహర్, అధిక సంఖ్యలో క్రిస్టియన్లు పాల్గొన్నారు.

సమగ్ర దర్యాప్తు నిర్వహించాలి

బొబ్బిలి : అనుమానాస్పద స్థితిలో మృతిచెందిన పాస్టర్ ప్రవీణ్ మృతిపై ప్రభుత్వం సమగ్ర విచారణ చేపట్టాలని ఆంధ్ర సార్వత్రిక లూథరన్ సంఘం ప్రతినిధి జె సి రాజు డిమాండ్ చేశారు. శుక్రవారం బొబ్బిలిలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రవీణ్ మరణం క్రైస్తవ సమాజానికి తీరని లోటన్నారు. ప్రవీణ్ మృతిని హత్యగానే క్రైస్తవులంతా భావిస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం సమగ్రంగా, నిష్పక్షపాతంగా దర్యాప్తు చేయాలని, పోస్టుమార్టం నివేదికను బహిర్గతం చేయాలని కోరారు.

టిపిబిఒలుగా ప్లానింగ్ కార్యదర్శులను నియమించాలి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

మున్సిపల్‌శాఖా మంత్రి నారాయణకు వినతినిస్తున్న అసోసియేషన్ ప్రతినిధులు

టిపిబిఒలుగా అర్హులైన ప్లానింగ్ కార్యదర్శులను నియమించాలని రాష్ట్ర మున్సిపల్ పట్టణాభివృద్ధి శాఖ మంత్రి నారాయణను శుక్రవారం ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ టౌన్ ప్లానింగ్ టెక్నికల్ అఫీషియల్స్ అసోసియేషన్ ప్రతినిధులు కోరారు. ఈమేరకు అమరావతిలోని సిఆర్‌డిఎ కార్యాలయంలో మంత్రి నారాయణను అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కొన్న వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో ప్రతినిధులు కలిసి టౌన్ ప్లానింగ్ విభాగానికి సంబంధించిన సమస్యలను ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. టౌన్ ప్లానింగ్ విభాగంలో ఖాళీగా ఉన్న టిపిబిఒ పోస్టులను అర్హులైన వార్డు ప్లానింగ్ సెక్రటరీల ద్వారా భర్తీ చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. టిడిఆర్ ల విషయంలో టౌన్ ప్లానింగ్ అధికారులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరారు. మంత్రి సానుకూలంగా స్పందించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

అడిషనల్ డైరెక్టర్ శ్రీనివాస్‌కు వినతి

రాష్ట్ర టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ అడిషనల్ డైరెక్టర్ శ్రీనివాస్‌కు అసోసియేషన్ ప్రతినిధులు వినతిపత్రాన్ని అందజేసారు రాష్ట్ర అధ్యక్షుడు కొన్న వెంకటేశ్వరరావుతో పాటు ఉపాధ్యక్షుడు అబ్దుల్ సత్తార్, కోశాధికారి కృష్ణ, ప్రతినిధులు, టౌన్ ప్లానింగ్ అధికారులు రంగప్రసాద్, నాయుడు, వెంకటరావు, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. రాష్ట్ర మున్సిపల్, పట్టణాభివృద్ధి శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎస్. సురేష్ కుమార్‌ను కూడా అసోసియేషన్ ప్రతినిధులు కలిశారు. టౌన్ ప్లానింగ్ సిబ్బంది సమస్యలపై వినతిపత్రం అందజేసారు.

ఉపాధి కూలీలకు బకాయిలు చెల్లించాలి

ప్రజాశక్తి-నెల్లిమర్ల

ఉపాధి హామీ కూలీలకు వేతన బకాయిలు వెంటనే చెల్లించాలని ఎపి రైతు సంఘం నాయకులు కిల్లంపల్లి రామారావు డిమాండ్ చేశారు. శుక్రవారం మండలంలోని కొత్తపేట, సీతారామునిపేట, టోంపలపేట, గొర్లిపేటలో ఆయన పర్యటించి, ఉపాధి కూలీలతో మాట్లాడారు. 9 వారాలుగా కూలీలకు వేతనాలు చెల్లించకపోవడం వల్ల అనేక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కుంటి సాకులు చూపించి పనులు కూడా నిలిపివేయడం దుర్మార్గమన్నారు. పని ప్రదేశంలో తాగునీరు, మెడికల్ కిట్లు, టెంట్లు కూడా ఏర్పాటు చేయడం లేదన్నారు. పని ప్రాంతాల్లో సౌకర్యాలు కల్పించి, వేతన బకాయిలు వెంటనే చెల్లించి, ఏడాదికి 200 పనిదినాలు కల్పించాలని డిమాండ్‌చేశారు. ఈ సమస్యలపై కలెక్టరేట్ వద్ద చేపట్టే ధర్నాను జయప్రదం చేయాలని కోరారు.

ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులు పరిష్కరించాలి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

పెండింగ్‌లో ఉన్న ఎల్‌ఆర్‌ఎస్, బిపిఎస్ దరఖాస్తులను తక్షణమే పరిష్కరించాలని ప్రణాళికా సిబ్బందికి ఎసిపిలు ఆదేశించారు. శుక్రవారం కార్యాలయంలో నిర్వహించిన ఎల్‌ఆర్‌ఎస్ ఓపెన్ ఫోరం సమావేశంలో అసిస్టెంట్ సిటీ ప్లానర్లు హరిబాబు, రమణమూర్తి మాట్లాడారు. 2024-25 ఆర్థిక సంవత్సరం ముగింపునకు మరో 4 రోజులే గడువు ఉన్నందున తక్షణమే ఎల్‌ఆర్‌ఎస్, బిపిఎస్ దరఖాస్తులను పరిష్కరించాలని అన్నారు. తాత్కాలిక ఆక్రమణ పన్నులను, ఆస్తి పన్నులను వెంటనే వసూలు చేయాలని చెప్పారు. పన్నుల వసూలులో నిర్లక్ష్యం వహించవద్దని చెప్పారు. వ్యక్తిగత దరఖాస్తులను కూడా తక్షణమే పరిష్కరించేందుకు అవసరమైన చొరవ చూపాలన్నారు. సమావేశంలో టిపిఒ అప్పలరాజు, టిపిఎస్ అనిత పాల్గొన్నారు.

ప్రభుత్వ ఐటిఐకి ప్రథమ బహుమతి

ప్రజాశక్తి-విజయనగరం కోట

అవార్డు అందుకుంటున్న ఐటిఐ ప్రిన్సిపాల్

గురువారం విశాఖలోని గాజువాక స్టీల్‌సిటీ ఐటిఐలో విఇటి, సిమెన్స్, టాటా స్ట్రైవ్ సంయుక్తంగా నిర్వహించిన ప్రాజెక్ట్ ఇన్నోవేషన్ ఛాలెంజ్ కాంపిటేషన్ లో మెకానికల్ విభాగం లో మొదటి బహుమతి విజయ నగరం ప్రభుత్వ ఐటిఐ సాధించింది. జోన్ 1లో ఉన్న ఐటిఐలకు సంబంధించిన ట్రైనీస్ , సిబ్బంది పాల్గొన్నారు. 30ప్రాజెక్టు లను ట్రైనీస్ ప్రదర్శించారు. ముఖ్యఅతిథిగా హాజరైన పట్టభద్రుల ఎంఎల్‌సి వేపాడ చిరంజీవి రావు ఐటిఐ ట్రైనీస్‌కు ట్రోఫీని బహుకరించారు. స్థానిక కార్పొరేటర్ నరసింహ పాత్రుడు, రీజినల్ డిప్యూటీ డైరెక్టర్ ఆర్‌వి రమణ, ప్రభుత్వ ఐటిఐ(న్యూ), విశాఖపట్నం ఐఎంసి చైర్మన్ బాలాజీ, కోరమండల్ ప్రతినిధి శ్రీనివాసరావు , టాటా స్ట్రైవ్ ప్రతినిధులు రమేష్ , మార్కండేయలు సంతోష్, జోన్ 1 ప్రిన్సిపాళ్లు పాల్గొన్నారు.

పారిశుధ్య నిర్వహణకు 47 డంపర్ బిన్స్ ఏర్పాటు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలో సంపూర్ణ పారిశుధ్యానికి అధిక ప్రాధాన్యతనిస్తున్నామని నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య తెలిపారు.. పారిశుధ్య నిర్వహణకు అవసరమైన 47 డెంపర్ బిన్లు శుక్రవారం అందుబాటులోకి తెచ్చినట్లు తెలిపారు. స్థానిక పాలస్పత్రి వద్ద నున్న మస్తర్ పాయింట్ లో ప్రజారోగ్య అధికారి డాక్టర్ కొండపల్లి సాంబమూర్తి సూచనలతో పారిశుధ్య పర్యవేక్షకులు బాలకృష్ణ, రవిశేఖర్, అంజిబాబు, షాలీం రాజచ తదితరులు డంపర్ బిన్లను భద్రపరిచారు. ఏ ప్రాంతంలో డంపర్ బిన్లు మరమ్మత్తులకు గురవుతాయో ఆయా ప్రాంతాలకు వాటిని వినియోగ నిమిత్తం తీసుకుని వెళ్తారు. ప్రజలు కూడా చెత్తలను ఆరుబయట వేయకుండా డస్ట్ బిన్ లో వేసి చెత్త తరలించే వాహనాలకు అందివ్వాలని సూచించారు.

జిల్లా యూనిట్‌గా వర్గీకరణ చేయాలి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఎస్‌సి వర్గీకరణలో రెల్లి కులస్తులకు తీవ్ర అన్యాయం జరిగిందని, ఎస్సీ వర్గీకరణను జిల్లా యూనిట్ గా చేయాలని రెల్లి కులస్తుల సంఘం నాయకులు బంగారు దుర్గారావు, కొమ్ము సోములు డిమాండ్ చేశారు. ఎస్‌సి వర్గీకరణలో రెల్లి కులస్తులకు జరిగిన అన్యాయానికి వ్యతిరేకంగా శుక్రవారం నగరంలో అంబేద్కర్ కూడలి వద్ద నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2011 జనాభా ప్రాతిపదికన ఎస్‌సి వర్గీకరణను అశాస్త్రీయంగా చేశారని అన్నారు. జిల్లా యూనిట్ గా చేస్తామని చెప్పి,రాష్ట్రం యూనిట్‌గా చేయడం వలన రెల్లి కులస్థులకు తీవ్రమైన అన్యాయం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా యూనిట్ గా వర్గీకరణ చేస్తే రెల్లి కులస్తులకు న్యాయం జరుగుతుందని అన్నారు. నిరసనకు జిల్లా అభివృద్ధి వేదిక వ్యవస్థాపకులు పి.షణ్ముఖరావు సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో రెల్లి కుల సంఘం నాయకులు చెన్న బంగారురాజు, కృష్ణవేణి, రఘు, రమణ,రామారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడులు

ప్రజాశక్తి-వేపాడ

ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడులు సాధించవచ్చని జెడ్‌పిటిసి సేనాపతి అప్పారావు తెలిపారు. శుక్రవారం వల్లంపూడి రైతు సేవా కేంద్రంలో నవధాన్యాల సాగుపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి రైతు ప్రకృతి వ్యవసాయం చేయాలన్నారు. దీనివల్ల భూసారం పెరగడంతోపాటు ఆరోగ్యకరమైన పంటలు లభిస్తాయని తెలిపారు. కార్యక్రమంలో వైస్ సర్పంచ్ రుద్ర వెంకటరావు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, విఎఎ రమేష్ , పవన్ పాల్గొన్నారు.

బొబ్బిలిరూరల్ : ప్రకృతి వ్యవసాయం చేసే రైతుకు, ఆ పంటలు తినేవారికి ఎన్నో ప్రయోజనాలని తహశీల్దార్ ఎం.శ్రీను తెలిపారు. శుక్రవారం మండలంలోని జగన్నాథపురంలో ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతులు కనిమెరక సూర్యనారాయణ, తెంటు సునీతను సన్మానించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ రవికుమార్ మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం ద్వారా శుద్ధమైన ఆహార ఉత్పత్తులు లభిస్తాయని, ఇది పర్యావరణ హితమైన వ్యవసాయ విధానమని చెప్పారు. రైతులు దీనిని విస్తృతంగా అనుసరించాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ పద్మ, సత్యనారాయణ, ఎంపిటిసి రౌతు తిరుపతిరావు, ప్రకృతి వ్యవసాయ ప్రతినిధి శంకరరావు పాల్గొన్నారు.

విజేతలకు పతకాలు అందజేస్తున్న డిప్యూటీ రిజిస్ట్రార్ ఆర్‌ఎస్ వర్మ

సెంచూరియన్‌లో ఫ్రెషర్స్‌డే వేడుకలు

ప్రజాశక్తి-నెల్లిమర్ల

సెంచూరియన్ విశ్వవిద్యాలయంలో శుక్రవారం ఫ్రెషర్స్‌డే వేడుకలు ఘనంగా జరిగాయి. వైస్ ఛాన్సలర్ ప్రశాంత కుమార్ మహంతి మాట్లాడుతూ విద్యార్థులు మంచి నడవడికతో ముందుకు సాగినప్పుడే భవిష్యత్తులో ఉన్నత స్థానాల్లో స్థిరపడతారన్నారు. రిజిస్ట్రార్ పల్లవి, డిప్యూటీ రిజిస్ట్రార్ ఆర్.ఎస్.వర్మ మాట్లాడుతూ విద్యార్థులు తోటి విద్యార్థులతో హద్దులు మీరకుండా మెలగాలన్నారు. ఈ సందర్భంగా వివిధ క్రీడా పోటీలలో విజేతలకు ఆర్.ఎస్.వర్మ పతకాలను అందజేశారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో డీన్లు, అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.

నేడు అధికారులతో సమీక్ష

ప్రజాశక్తి-వేపాడ

స్థానిక ఎంపిడిఒ కార్యాలయ సమావేశ మందిరంలో శనివారం మండల స్థాయి అధికారులతో ప్రత్యేకాధికారి సమీక్షిస్తారని ఎంపిడిఒ సిహెచ్ సూర్యనారాయణ తెలిపారు. సమావేశానికి అధికారులతోపాటు 29 గ్రామ పంచాయతీల కార్యదర్శులు తప్పనిసరిగా హాజరుకావాలని సూచించారు.

బిసి రుణాల లబ్ధిదారుల ఎంపిక

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

రాష్ట్ర ప్రభుత్వం వెనుకబడిన తరగతుల యువతీ యువకుల ఉపాధి కోసం బిసి రుణాలు అందించేందుకు శుక్రవారం రాజీవ్ స్టేడియంలో లబ్ధిదారుల దరఖాస్తుల ఎంపిక కార్యక్రమం జరిగింది. రాజీవ్ స్టేడియంలో 1వ డివిజన్ నుండి 30వ డివిజన్ పరిధిలో లబ్ధిదారులు తమ దరఖాస్తులను అందజేశారు. శనివారం 31వ డివిజన్ నుంచి 50వ డివిజన్ పరిధిలో లబ్ధిదారులు తమ దరఖాస్తులను అందించనున్నారు. ఈ సందర్భంగా కమిషనర్ పల్లినల్లనయ్య మాట్లాడుతూ బిసి కార్పొరేషన్ రుణాలు కోసం 2,820 దరఖాస్తులు వచ్చాయన్నారు. వీటిలో 366 యూనిట్లకు ఏర్పాటుకు గాను ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు.

2 లక్షల యూనిట్‌కు రూ.75వేల సబ్సిడీతో 271, 3లక్షల యూనిట్ కోసం 1.25 లక్షల రూపాయలు సబ్సిడీతో 71, 5 లక్షల యూనిట్ల కొరకు 2 లక్షల రూపాయలు సబ్సిడీతో 24 యూనిట్లు మంజూరుకు అవకాశం ఉందన్నారు. 14జనరిక్ మందుల షాపులకోసం 4నుండి 8 లక్షలు రూపాయలు మంజూరుకు అవకాశం ఉందన్నారు. మంజూరైన రుణాలతో మంచి వ్యాపారాలు చేసి ఆర్థిక సాధికారత దిశగా పయనించాలని ఆకాంక్షను వ్యక్తం చేశారు. కార్యక్రమంలో టిపిఆర్ఓ సింహాచలం పాల్గొన్నారు.

డెంకాడ : బిసి కార్పొరేషన్ రుణాల కోసం అభ్యర్థులు చేసుకున్న దరఖాస్తులను శుక్రవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో పరిశీలించారు. 621 మంది దరఖాస్తు చేసుకోగా 549 మంది హాజరయ్యారు. ఎంపిపి బంటుపల్లి వెంకట్ వాసుదేవరావు ఆధ్వర్యంలో దరఖాస్తులను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ వై.భవాని, ఎస్‌బిఐ డెంకాడ, భోగాపురం బ్రాంచి మేనేజర్లు, బిసి కార్పొరేషన్ జూనియర్ సహాయకులు విద్యాసాగర్, తదితరులు పాల్గొన్నారు.

రామభద్రపురం : స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో బిసి కార్పొరేషన్ రుణాలకు శుక్రవారం ఇంటర్వ్యూలు చేపట్టారు. మండలంలో 455 దరఖాస్తులు రాగా, ఇంటర్వ్యూలకు 449 మంది హాజరైనట్లు ఎంపిడిఒ రత్నం తెలిపారు. పారదర్శకంగా లబ్ధిదారులను ఎంపిక చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి డి.వెంకటరమణ, ఎస్‌బిఐ బ్రాంచి మేనేజర్ హరింద్ర బెలగాం, యూనియన్ బ్యాంకు మేనేజర్లు స్వరాజ్, వాసు, ఎపిజివిబి ఫీల్డ్ ఆఫీసర్లు రాజశేఖర్, సత్యనారాయణ పాల్గొన్నారు.

పూసపాటిరేగ : మండలంలోని బిసి కార్పొరేషన్ రుణాలకు 600 దరఖాస్తులు వచ్చినట్లు ఎంపిడిఒ ఎం.రాధిక తెలిపారు. శుక్రవారం 14 పంచాయతీలకు సంబంధించి దరఖాస్తులు పరిశీలన చేపట్టారు. శనివారం మరో 14 పంచాయతీల దరఖాస్తులు పరిశీలించాల్సి ఉంది.

నేడు రేగిడిలో ఇంటర్వ్యూలు

రేగిడి : ఎంపిడిఒ కార్యాలయంలో శనివారం బిసి కార్పొరేషన్ రుణాలకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ శ్యామల కుమారి తెలిపారు. మండలంలో 448 మంది దరఖాస్తు చేసుకున్నట్లు చెప్పారు.

1న వేపాడలో ..

వేపాడ : స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఏప్రిల్ ఒకటో తేదిన బిసి కార్పొరేషన్ రుణాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ సిహెచ్ సూర్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న వారంతా తమ ధ్రువపత్రాలతో హాజరుకావాలని కోరారు.

కౌంటర్ వద్ద అభ్యర్థుల తోపులాట

ఇంటర్వ్యూల్లో గందరగోళం

బొబ్బిలి : బిసి కార్పొరేషన్ రుణాల కోసం నిర్వహించిన ఇంటర్వ్యూల వద్ద గందరగోళం నెలకొంది. మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం బిసి రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఇంటర్వ్యూ నిర్వహించారు. ఇంటర్వ్యూకు వచ్చిన అభ్యర్థులు పేర్లు నమోదు చేసుకునేందుకు కౌంటర్‌ను ఏర్పాటు చేశారు. ఇంటర్వ్యూలకు 516 మంది దరఖాస్తు చేసుకున్నారు. వీరందరికీ ఒకే కౌంటర్ ఏర్పాటు చేయడంతో పేర్లు నమోదు చేసుకునేందుకు తోపులాటకు దిగారు. దీంతో మున్సిపల్ కార్యాలయం వద్ద గందరగోళం నెలకొంది. ఇంటర్వ్యూలకు వచ్చిన వారంతా తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మెప్మా కార్యాలయంలో బ్యాంకర్లు అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. కార్యక్రమంలో టిపిఆర్ఓ ఎం.జగన్మోహన్, మెప్మా ఉద్యోగులు పాల్గొన్నారు.

'కడలి'కి గోల్డ్ మెడల్

ప్రజాశక్తి-నెల్లిమర్ల

చిత్రలేఖనం పోటీల్లో జరజాపుపేటకు చెందిన చిత్రకారుడు, విశ్రాంత ప్రధానోపాధ్యాయులు కడలి ప్రకాశరావుకు బంగారు పతకం లభించింది. తెలంగాణలో వరంగల్ జిల్లా హనుమకొండలో జరిగిన ఆన్‌లైన్ చిత్రలేఖనం పోటీల్లో 'మహిళా శక్తి' అనే అంశంపై ప్రకాశరావు గీసిన వర్ణ చిత్రానికి బంగారు పతకం లభించింది. ఈ సందర్భంగా ప్రకాశరావును గ్రంథాలయం కమిటీ సభ్యులు, గ్రామపెద్దలు, ఉపాధ్యాయులు అభినందించారు.

31న గ్రీవెన్స్ రద్దు

ప్రజాశక్తి-విజయనగరంకోట

ఈ నెల 31న రంజాన్ పండుగ సందర్భంగా కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక (గ్రీవెన్స్ సెల్) రద్దు చేసినట్లు డిఆర్ఒ ఎస్.శ్రీనివాసమూర్తి తెలిపారు. అర్జీదారులు ఈ విషయాన్ని గమనించాలని ఆయన సూచించారు.

నేడు టిడిపి ఆవిర్భావ దినోత్సవం

ప్రజాశక్తి-వేపాడ

వేపాడలో శనివారం ఉదయం 10 గంటలకు టిడిపి ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ మండల అధ్యక్షులు గొంప వెంకటరావు తెలిపారు. ఈ కార్యక్రమానికి మండల కమిటీ సభ్యులు, గ్రామాల అధ్యక్షులు, సీనియర్ నాయకులు హాజరుకావాలని కోరారు. కార్యక్రమానికి అధిక సంఖ్యలో కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని విజ్ఞప్తిచేశారు.

పాఠశాలల రికార్డులు తనిఖీ

ప్రజాశక్తి-వేపాడ

మండలంలోని ఎస్.కోట సీతారాంపురం, రామస్వామిపేట గ్రామాల్లోని ప్రాథమిక పాఠశాలలను శుక్రవారం ఎంఇఒ పి.బాల భాస్కరరావు సందర్శించారు. పాఠశాలలకు సంబంధించిన రికార్డులను తనిఖీ చేశారు. విద్యార్థుల వర్క్‌బుక్స్, పాఠశాల ఆవరణ, మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి, సంతృప్తి వ్యక్తంచేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, సిఆర్‌పిలు పాల్గొన్నారు.

లేఅవుట్ క్రమబద్ధీకరణపై అభ్యంతరాలు తెలపండి

ప్రజాశక్తి-బొబ్బిలి

బొబ్బిలి మున్సిపాలిటీలోని మల్లమ్మపేట రెవెన్యూ పరిధిలో సర్వే నెంబర్ 207/పి 2.136 ఎకరాలలో వేసిన లేఅవుట్‌ను ఎల్‌ఆర్‌ఎస్ కింద క్రమబద్ధీకరణ చేశామని, ఎటువంటి అభ్యంతరాలున్నా తెలపాలని మున్సిపల్ కమిషనర్ ఎల్.రామలక్ష్మి కోరారు. లేఅవుట్ క్రమబద్ధీకరణ పత్రాలను శుక్రవారం మున్సిపల్ నోటీసు బోర్డులో ప్రదర్శనకు ఉంచారు. అభ్యంతరాలు 15రోజుల్లో తెలపాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

సీతం కళాశాలలో రక్తదానం

ప్రజాశక్తి-విజయనగరం

సీతం ఇంజినీరింగ్ కళాశాలలో విజయ దుర్గ యువజన సంఘం ఆధ్వర్యాన శుక్రవారం రక్తదానం, వైద్య శిబిరం నిర్వహించారు. స్వచ్ఛంద రక్తదానాన్ని ప్రోత్సహించేందుకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, ఎన్‌సిసి క్యాడెంట్లు పాల్గొన్నారు. సుమారు వంద యూనిట్లు రక్తదానం చేశారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి.వి. రామమూర్తి, డైరెక్టర్ డాక్టర్ ఎం. శశిభూషణరావు, ఎన్ఎస్ఎస్ జిల్లా నోడల్ ఆఫీసర్ ఎన్. సతీష్ కుమార్, ఎన్‌సిసి ఆఫీసర్ ఎం. వరలక్ష్మి, ఎస్. ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

రామాలయానికి రూ.20 వేలు విరాళం

ప్రజాశక్తి - పూసపాటిరేగ

మండలంలోని వెంపడాం పంచాయతీ పరిధిలోని తాళ్లపేటలో నిర్మాణంలో ఉన్న రామాలయానికి జనసేన నాయకులు, గోవిందపురం ఉప సర్పంచి బాలా అప్పలరాజు రూ.20 వేలు విరాళం అందజేశారు. కార్యక్రమంలో ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు వాళ్లే రామునాయుడు, వాళ్లే హక్కునాయుడు, వాళ్లే గణపతిరావు, పిన్నింటి రామునాయుడు, పిన్నింటి సన్యాసినాయుడు, తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రాలు ప్రారంభం

ప్రజాశక్తి-తెర్లాం

మండలంలోని పలు గ్రామాల ప్రధాన కేంద్రాల్లో శుక్రవారం రెవెన్యూ సిబ్బంది చలివేంద్రాలను ఏర్పాటు చేశారు. ఎండలు తీవ్రంగా ఉండటంతో తహశీల్దార్ హేమంత్ కుమార్ చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని ఆదేశాలు జారీ చేశారు. పెరుమాళి, తెర్లాం అడ్డురోడ్డు కూడలి, ఎమ్మార్ అగ్రహారం, లోచర్లలో వీటిని ప్రారంభించారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది, విఆర్ఒ నరసింహనాయుడు, ఎమ్మార్ అగ్రహారం సర్పంచ్ ఎల్.లక్ష్మి పాల్గొన్నారు.

టౌన్ ప్లానింగ్ తీరుపై కౌన్సిలర్ల ఆగ్రహం

సమావేశంలో టౌన్‌ప్లానింగ్ అధికారులను నిలదీస్తున్న కౌన్సిలర్లు

ప్రజాశక్తి-నెల్లిమర్ల

టౌన్ ప్లానింగ్ పనితీరుపై కౌన్సిలర్లు ఆగ్రహం వ్యక్తంచేశారు. శుక్రవారం స్థానిక నగర పంచాయతీ కార్యాలయంలో చైర్ పర్సన్ బంగారు సరోజినీ ఆధ్వర్యంలో కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. సమావేశానికి మార్క్‌ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగార్రాజు హాజరయ్యారు. ఈ సందర్భంగా కౌన్సిలర్లు మైపాడ ప్రసాద్, మొయిద శ్రీనివాసరావు, టిడిపి నాయకులు లెంక అప్పలనాయుడు మాట్లాడుతూ సర్వే నంబర్ 52, 60, 66లో ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురవుతున్నా టౌన్ ప్లానింగ్ అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. మూడు సర్వే నెంబర్లలో ఫోర్జరీ సంతకాలతో ఇళ్ల పొజిషన్ ధ్రువపత్రాలు జారీ చేసి, వాటికి ఇంటి పన్నులు కూడా వేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. చంద్రబాబు నగర్‌లో ప్రభుత్వ స్థలాల్లో ఇప్పటి వరకు నకిలీ పట్టాలు, నకిలీ పొజిషన్ సర్టిఫికెట్లు జారీ చేస్తున్నారని, ఆక్రమణలపై ఫిర్యాదులు చేస్తే అధికారులు పలానా నాయకులను కలవాలని చెప్పడం విడ్డూరంగా ఉందంటూ మండిపడ్డారు. నగర పంచాయతీ అవుట్ సోర్సింగ్ సిబ్బంది మీ సేవా కేంద్ర నిర్వాహకులతో కుమ్మక్కై, నకిలీ పట్టాలు, పొజిషన్ సర్టిఫికెట్లు తయారు చేస్తున్నారని ఆరోపించారు. ఇంటి పన్ను వేసేటప్పుడు అధికారులు నకిలీవో, అసలువో గుర్తించే బాధ్యత లేదా? అని ప్రశ్నించారు. కౌన్సిలర్లు లేవనెత్తిన అంశాలపై మార్క్‌ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగార్రాజు స్పందించారు. ప్రభుత్వ భూముల్లో ఇన్ని అక్రమాలు జరుగుతుంటే అధికారులు ఏమి చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే ప్రభుత్వ భూముల వివరాలు పంపించి ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

అనంతరం పలు అంశాలపై చర్చించారు. మార్క్‌ఫెడ్ చైర్మన్ బంగార్రాజును సభ్యులు సత్కరించారు. సమావేశంలో వైస్ చైర్మన్లు సముద్రపు రామారావు, కారుకొండ కృష్ణ, కమిషనర్ కె.అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

పి4 ప్రారంభ కార్యక్రమానికి జిల్లా ప్రతినిధులు

విజయనగరం : ఈనెల 30 ఉగాది రోజున విజయవాడలో రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా ప్రారంభించనున్న పి4 కార్యక్రమానికి జిల్లా నుంచి వివిధ రంగాల ప్రతినిధులు హాజరు కానున్నారు. దీనికోసం జిల్లాలోని ఏడు నియోజకవర్గాల నుంచి 7 ఆర్టీసీ బస్సులను ఏర్పాటు చేశారు. దీనికి సంబంధించి చేయాల్సిన ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ తమ ఛాంబర్లో వివిధ శాఖల అధికారులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. విద్యార్థులు, ఉపాధి వేతనదారులు, స్వయం శక్తి సంఘాల ప్రతినిధులు, రైతులను అన్ని నియోజకవర్గాల నుంచి ప్రతినిధులుగా ఎంపిక చేసి పంపించాలని చెప్పారు. బస్సుకు సుమారు 50 మంది చొప్పున ఏడు బస్సుల్లో జిల్లా నుంచి పి4 కార్యక్రమానికి పంపించాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ బస్సులు శనివారం సాయంత్రం బయలురేలా చూడాలన్నారు. ప్రతి బస్సులో పోలీస్ కానిస్టేబుల్, ఎఎన్ఎంను ఉంచాలని, ప్రతి బస్సుకు ఒక లైజనింగ్ అధికారిని నియమించాలని ఆదేశించారు. వారికి భోజన సౌకర్యాల కల్పించాలన్నారు. జిల్లానుంచి అలజంగి, రావివలస సర్పంచులను కూడా ఈ సమావేశానికి పంపిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎస్. సేతు మాధవన్, ఎఎస్‌పి సౌమ్యలత, డిఆర్ఒ ఎస్ .శ్రీనివాసమూర్తి, డిఆర్‌డిఎ పీడీ ఎ.కళ్యాణ చక్రవర్తి, సిపిఒ పి.బాలాజీ, డిటిసి మణికుమార్, పశుసంవర్ధక శాఖ జెడి డాక్టర్ వైవి రమణ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

న్యాయవాదుల సంఘ అధ్యక్షులుగా రవిబాబు

న్యాయవాదుల సంఘం నూతన కార్యవర్గం

ప్రజాశక్తి-విజయ నగరం లీగల్

స్థానిక న్యాయవాదుల సంఘ అధ్యక్షులుగా కలిశెట్టి రవిబాబు ఎన్నికయ్యారు. జిల్లా బార్‌అసోసియేషన్ కార్యవర్గం ఎన్నికలు శుక్రవారం జిల్లా కోర్టులోని అసోసియేషన్ హాలులో జరిగాయి. 635 మంది ఓటర్లకు గాను 560 మంది ఓటేశారు. అధ్యక్ష పదవికి కలిశెట్టి రవి బాబు, ధవళ వెంకట రావు మధ్య పోటీ నెలకొనగా రవిబాబుకు 308 ఓట్లు, వెంకట రావుకు 250 ఓట్లు వచ్చాయి. 58 ఓట్ల మెజార్టీతో రవిబాబు అధ్యక్షులుగా గెలుపొందారు. సంయుక్త కార్యదర్శిగా పదవి పోటీపడిన బర్నాల సీతా రామ రాజు కు 281 ఓట్లు రాగా,సారిక సతీష్ కు 277 ఓట్లు వచ్చాయి. 4 ఓట్లు తేడా తో సీతా రామ రాజు గెలు పొందారు. ఉపాధ్యకునిగా పేడాడ శివప్రసాద్, కార్యదర్శి గా నళితం సురేష్ కుమార్, కోశాధికారిగా కె.వెంకటరావు, గ్రంథాలయ కార్యదర్శిగా ఎం.తాడి రాజు, మహిళా రిప్రజెంటేటివ్‌గా కె.బ్యూలారాణి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారులుగా సిహెచ్ దామోదర రావు, కంటుభుక్త శ్రీనివాస రావు, పెంట శ్రీరామమూర్తి, వి.రత్న కుమారి వ్యవహరించారు. ఎన్నికైన నూతన కార్యవర్గం ఏడాది పాటు బాధ్యతల్లో ఉంటుంది. కార్యవర్గ సభ్యులకు పలువురు న్యాయ వాదులు అభినందనలు తెలిపారు.

సిఎస్‌ఆర్ నిధులతో రెండు ఐటిఐ ల్యాబ్స్

ప్రజాశక్తి-విజయనగరంకోట

కార్పొరేట్ సామాజిక బాధ్యత (సిఎస్‌ఆర్) క్రింద జిల్లాలో రెండు ఐటిఐ ల్యాబ్‌ల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ అధికారులను ఆదేశించారు. ఐటిఐ విద్యార్థులకు ఆధునిక యంత్రాలపై శిక్షణ ఇచ్చి, ఫార్మా, ఫెర్రో అల్లాయిస్ పరిశ్రమల్లో పనిచేయడానికి అనుగుణంగా తీర్చిదిద్దేందుకు ఈ ల్యాబ్‌లు దోహదం చేస్తాయని తెలిపారు. జిల్లాలో ఫెర్రో అల్లాయిస్, ఫార్మా రంగాలకు అనుబంధంగా ఈ ల్యాబ్స్‌ను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు వచ్చినట్లు కలెక్టర్ తెలిపారు. జిల్లాలో విజయనగరం, బొబ్బిలి, రాజాంలో ప్రభుత్వ ఐటిఐలు ఉన్నాయని చెప్పారు. బొబ్బిలి, విజయనగరం ఐటిఐలకు కలిపి ఫెర్రో పరిశ్రమల అనుబంధ ల్యాబ్‌ను, రాజాం ఐటిఐలో ఫార్మా పరిశ్రమలకు అనుబంధంగా ల్యాబ్‌ను ఏర్పాటు చేయాల్సి ఉంటుందని చెప్పారు. ఫెర్రో ల్యాబ్ ఏర్పాటుకు సుమారు రూ.కోటి, ఫార్మా ల్యాబ్‌కు రూ.25లక్షలు వరకు ఖర్చు అవుతుందన్నారు. ఈ నిధులను ఆయా కంపెనీల ద్వారా సిఎస్‌ఆర్ కింద సమకూర్చి, ల్యాబ్‌లు ఏర్పాటుకు కృషి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో సిపిఒ పి.బాలాజీ, ఐటిఐ కన్వీనర్ టివి గిరి, పరిశ్రమల శాఖ ఎడి రామకృష్ణ, జిల్లా ఉపాధి అధికారి అరుణ, జిల్లా నైపుణ్య అధికారి జి.ప్రశాంత్‌కుమార్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

అవంతిలో ఘనంగా అవెన్సిస్ యువజనోత్సవాలు

గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేస్తున్న ముత్తంశెట్టి ప్రియాంక

ప్రజాశక్తి-భోగాపురం

మండలంలోని చెరుకుపల్లి వద్దనున్న అవంతి ఇంజినీరింగ్ కళాశాలలో అవెన్సిస్ 2కె25 యువజనోత్సవాలు శుక్రవారం ఘనంగా జరిగాయి. అవంతి విద్యాసంస్థల చైర్మన్ ముత్తంశెట్టి శ్రీనివాసరావు మాట్లాడుతూ రాష్ట్రంలో అవంతి కళాశాలకు ప్రత్యేకత ఉందన్నారు. అన్ని రంగాల్లోనూ విద్యార్థులు ఆరితేరి ఉండాలని తెలిపారు. శ్రీకృష్ణ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ కె.రాంజీ మాట్లాడుతూ నూతన జాతీయ విద్యా విధానం ద్వారా ప్రతి ఒక్కరూ నైపుణ్యం సాధించాలని తెలిపారు. వెయిట్ లిఫ్టర్, అర్జున అవార్డు గ్రహీత నీలంశెట్టి లక్ష్మి మాట్లాడుతూ విద్యార్థులు ఏదో ఒక క్రీడలో నైపుణ్యం సాధించాలన్నారు. అనంతరం క్రీడల్లో రాణించిన విద్యార్థులకు ముత్తంశెట్టి ప్రియాంక చేతుల మీదుగా అవార్డులను ప్రదానం చేశారు. విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. సినీ నేపథ్య నాయకులు శ్రీకృష్ణ, ఉమా నేహ పాడిన పాటలు ఉర్రూతలూగించాయి. ప్రిన్సిపల్స్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పేదల భూములు తిరిగివ్వకపోతే పోరాటం

ప్రజాశక్తి-బొబ్బిలి

పేదల భూములు తిరిగి ఇవ్వకపోతే పోరాటం చేస్తామని కాంగ్రెస్ పార్టీ మాజీ ఎంపి హర్షకుమార్ అన్నారు. బొబ్బిలి గెస్ట్‌హౌస్ సమీపంలో కాంగ్రెస్ హయాంలో పేదలకు ఇచ్చిన సీలింగ్ భూములను శుక్రవారం ఆయన పరిశీలించారు. రైతులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. తమకు ఇచ్చిన భూములను బొబ్బిలి రాజులు తీసుకున్నారని రైతులు ఆరోపించారు. ఈ సందర్భంగా హర్షకుమార్ మాట్లాడుతూ 1991లో కాంగ్రెసు హయాంలో సీలింగ్ భూములను పేదలకు ఇస్తే ఎమ్మెల్యే బేబినాయన తీసుకోవడం సరికాదన్నారు. సీలింగ్ భూముల పంపిణీలో పేదలకు డి-పట్టా హక్కులను ప్రభుత్వం కల్పించిందని చెప్పారు. పేదలకు న్యాయం చేయకపోతే పోరాటం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పిసిసి సభ్యులు మువ్వల శ్రీనివాసరావు, సిపిఐ జిల్లా కార్యదర్శి ఒమ్మి రమణ, కాంగ్రెస్ పట్టణ నాయకులు శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఎపిజిఎల్‌ఐ క్లెయిములు క్లియర్ చేయాలి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఇప్పటివరకు పెండింగ్‌లో ఉన్న ఎపిజిఎల్‌ఐ క్లెయిములను క్లియిర్ చేయాలని పిఅర్‌టియు జిల్లా ప్రధాన కార్యదర్శి బి.శ్రీనివాస్, నాయకులు బంకపల్లి శివప్రసాద్, అర్.రామకృష్ణారెడ్డి, ఆర్.శంకరరావు కోరారు. ఎపిజిఎల్‌ఐ డైరెక్టర్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. కొందరికి పొరపాటుగా అదనపు ప్రీమియం చెల్లిపు జరిగిందని, మరి కొందరికి ఎపిజిఎల్‌ఐ ఖాతా నంబర్‌లు లేవని, మరికొందరికి బాండ్లు జనరేట్ కాలేదని తెలిపారు. ఈ సమస్యలన్నీ పరిష్కరించాలని కోరారు.

ముగిసిన మధ్యవర్తిత్వ శిక్షణ

ప్రజాశక్తి-విజయనగరం లీగల్

ఈనెల 24 నుంచి జరుగుతున్న మధ్యవర్తిత్వ శిక్షణ కార్యక్రమం శుక్రవారంతో ముగిసింది. ఈ సందర్భంగా శిక్షణ పూర్తి చేసిన న్యాయవాదులను ఉద్దేశించి జిల్లా జడ్జి బి.సాయి కళ్యాణ్ చక్రవర్తి మాట్లాడారు. మంచి మనసున్న మనుషులే మనుషులను మంచివారిగా చేయగలరని, ఈ శిక్షణ అందుకు ఉపయోగపడుతుందని అన్నారు. వ్యాజ్యాలను మానవతా దక్పథంతో పరిశీలించి ఉభయ పార్టీల ద్వారానే పరిష్కారం రాబట్టాలని న్యాయవాదులకు సూచించారు. శిక్షణ కార్యక్రమం పూర్తిచేసిన న్యాయ వాదులను ఆయన అభినందించారు. మధ్యవర్తిత్వం వల్ల ఉభయ పార్టీలకు సమయం, డబ్బు వృథా కాకుండా ఉంటుందని అన్నారు. కోర్టుల్లో చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న కేసులకు పరిష్కారం చూపవచ్చునని సూచించారు. అనంతరం శిక్షణ ఇచ్చిన మాస్టర్స్ ట్రైనీస్ షేక్ మహమ్మద్ సిరాజ్, ఆర్.రత్న తారను సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ కార్యదర్శి బిహెచ్‌వి లక్ష్మీకుమారి పాల్గొన్నారు.

గిరిజన ఆశ్రమ పాఠశాలకై ఎస్‌టి కమిషన్‌కు వినతి

ప్రజాశక్తి- విజయనగరం

జిల్లాలో అదనంగా మరికొన్ని గిరిజన ఆశ్రమ బాలికల ఉన్నత పాఠశాలలు అవసరమవుతాయని బొబ్బిలి, విజయనగరం గిరిజన ఆశ్రమ పాఠశాలల ఉపాధ్యాయులు రాష్ట్ర ఎస్‌టి కమిషన్ చైర్మన్ డాక్టర్ డివిజి శంకర్రావుకు వినతి అందజేశారు. విజయనగరంలోని ఆయన క్యాంపు కార్యాలయంలో ఉపాధ్యాయులు కలిశారు. రెండే బాలికల ఆశ్రమ పాఠశాలలు ఉన్నందున మరో పాఠశాల అదనంగా కావాలని వారు కోరారు. ఆశ్రమ పాఠశాలల్లో సీట్లు ఫిలప్ అయినందున , వివిధ ప్రాంతాల్లో ఉన్న గిరిజన బాలికలు డ్రాపౌట్స్ పెరుగుతున్నాయని చైర్మన్ దృష్టికి తీసుకొచ్చారు. చైర్మన్ డాక్టర్ డివిజి శంకరరావు మాట్లాడుతూ గిరిజన బాల బాలికలందరూ పాఠశాల విద్యకు దూరం కాకుండా విద్యనభ్యశించాల్సి వుందన్నారు. ఉపాధ్యాయుల వినతిపై సానుకూలం గా స్పందిస్తూ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్తానని తెలిపారు.

నేడు, రేపు నూకాంబిక తీర్థం

ప్రజాశక్తి-శృంగవరపుకోట

పట్టణంలో నూకాలమ్మ దేవాలయం వద్ద శని, ఆదివారాల్లో నూకాంబిక అమ్మవారి తీర్థం నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మకర్త మల్ల గణేష్ తెలిపారు. తీర్థం సందర్భంగా శనివారం జిల్లాస్థాయి వాలీబాల్ పోటీలు నిర్వహిస్తామని, ఆదివారం ఎడ్ల పందేలు, సాంస్కృతిక కార్యక్రమాలు, బాణసంచా, తదితర కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నామని వివరించారు.

ఘటనా స్థలంలో పోలిరాజు మృతదేహం

వాటర్ ట్యాంకర్ బోల్తా.. డ్రైవర్ మృతి

ప్రజాశక్తి-బొబ్బిలి

మండలంలోని చిత్రకోట బొడ్డవలస సమీపంలో టేకు మొక్కలకు నీరు పెడుతున్న వాటర్ ట్యాంకర్ బోల్తా పడడంతో డ్రైవర్ పెద్దిరెడ్డి పోలిరాజు (56) దుర్మరణం చెందారు. పార్వతీపురం మన్యం జిల్లా సీతానగరం మండలం కాశయ్యపేటకు చెందిన పోలిరాజు వాటర్ ట్యాంక్ డ్రైవర్‌గా పని చేస్తున్నారు. కె.నీలమ్మ భూమిలో నాటిన టేకు మొక్కలకు నీరు పోస్తుండగా ట్రాక్టర్ అదుపు తప్పింది. దీంతో ట్రాక్టర్ ఇంజిన్ కింద డ్రైవర్ పడి, తల నుజ్జునుజ్జు కావడంతో అక్కడికక్కడే మరణించారు. పోలిరాజు కుమారుడు సూర్యనారాయణ ఫిర్యాదు మేరకు పట్టణ సిఐ కె.సతీష్ కుమార్ సంఘటనా స్థలానికి చేరుకున్నారు. కేసు నమోదు చేశారు. కుటుంబ పెద్దదిక్కు మరణించడంతో కుటుంబ సభ్యులు విలపిస్తున్నారు.

రెండు బైకులు ఢీకొని వ్యక్తి దుర్మరణం

ప్రజాశక్తి-వేపాడ

క్రాంతి (ఫైల్)

మండలంలోని కొత్తబొద్దాం వద్ద గురువారం రాత్రి పది గంటల సమయంలో ఎదురెదురుగా వస్తున్న బైకు, స్కూటర్ ఢీకొన్నాయి. ఈ ఘటనలో శృంగవరపుకోటకు చెందిన బి.క్రాంతి(19) మరణించాడు. మరో నలుగురికి గాయాలై చికిత్స పొందుతున్నారు. క్రాంతి స్నేహితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ దేవి తెలిపారు.